# బలానికి లక్ష్యం

నాకు బాగా జ్ఞాపకం– సంవత్సరం క్రిందట నేనా పట్టణంలో కాలుపెట్టిన మొదటి రోజున కాఫీకి బయలుదేరి ఆ హోటల్ ముందుకు రాగానే ఆగిపోయాను– చక్కటి రంగులతోడి సైన్‌బోర్డు మీద అక్షరాల వింత శిల్పం, అంతగా ఆకర్షించింది.

కొన్నాళ్ళదాకా రోజూ కాఫీ హోటల్లో దూరే ముందూ తిరిగి బయటికి వచ్చాకా, ఆ చక్కటి సైన్ బోర్డు వంక ఓసారి చూసి పోతుండేవాణ్ణి.

–క్రమంగా ఆ వంక చూడటం మరిచిపోయాననుకోండి... కాని లోపలి హాలులో వున్న విదేశ చిత్రాలు మాత్రం యీనాటి వరకూ నా పరవశ దృక్కులను కోల్పోలేదు. ముఖ్యంగా ఆ చిత్రం – యెత్తైన పచ్చికలో చీకటుల ఆగమనాన్ని తెలుసుకుంటున్న తోట, తోట నంటి పెట్టకొని వున్న విశాలమైన నిలువ నీరు, వెనుక అనతి దూరంలో నీ రెండలో వింతరంగులనందిన పెద్ద రాతి గుట్టలూ, ఓ గుట్టపై శిధిల దశలోని కట్టడం– ఆ చిత్రం నా జీవితాంతం వరకూ నా మెప్పును కోల్పోదనుకుంటాను.

ఇంతకన్నా శక్తివంతమైన ఆకర్షణ కూడా అక్కడ వుంది. ఆ ద్వారం దగ్గిర... ఆ మార్బుల్ శ్లాబ్ టేబిల్ ముందర... కుర్చీలో లావుగా పొట్టిగా మెల్లకన్నుతో కూర్చుని... గర్వలేశం, ధైర్యపూర్వకమైన జాగ్రత్త ప్రతిఫలించే ముఖంతో... డబ్బు డ్రాయర్‌లోనికి లాక్కునేటప్పుడూ, చిల్లర తిరిగి యిచ్చేటప్పుడూ ఆ లక్ష్యాన్ని ద్యోతకం చేస్తూ ప్రత్యేక పద్ధతిలో కదిలే చేతులతో.. ఆ అయ్యరు.

ఆవేళ కూడా చిత్రాలను చూసి చూసి అయ్యరు వంక తిరిగాను.

చూస్తూ వుంటేనే ఓ పెద్దమనిషి... (పెద్ద్ద మనిషి) మధ్యగా ప్రవేశించి నా అవధానము (Attention)ను లాక్కున్నాడు. నా దృష్టి అతనిననుసరించే కదిలి నా యెదుటి కుర్చీలో స్థిరంగా కూర్చున్న అతని ముఖంపై నిలిచిపోయింది. కాఫీ తెప్పించుక త్రాగుతున్నాడు. నేనా ముఖంలోకే చూస్తున్నాను.

ఖద్దరు వస్త్రాల్లో, పొడవైన నడుం మీద... విశాలమైన ఛాతీమీద... బలమైన కంఠం మీద – బిరుసెక్కిన గడ్డంపైన.. స్వభావమైన పట్టుదలను చాటే పెదవులూ, జంకొదవచేసే మీసాలూ, ధైర్యాన్ని ప్రదర్శించే అరమోడ్పు కళ్ళూ, దూరాలోచనను స్పష్టపరిచే నుదురూ – మరుపు పడరాని మనిషి.

నేనతనివంక చూస్తూనే వున్నాను– చట్టున వెనుదిరిగి ఏబిరీనీ ఊబిలీజిలి వంక ఒకసారి చూసి, చప్పున లేచి అప్పుడే ద్వారానికి సమీపిస్తున్న ఓ పల్లెటూరి రైతును చెయ్యిపట్టి వెనక్కు తీసుకువచ్చి అయ్యరు టేబిల్ ముందర నిలబడ్డాడు.

సాగిపోతూ వున్న ప్రవాహం గట్టు వేసినట్టు నిలిచిపోయి ఆ దృశ్యం గమనిస్తోంది.

అయ్యరు.. శతృ మృగం రాకను పసికట్టిన జంతువువలె తలెత్తి దిక్కులు చూస్తూ... ఆ పెద్దమనిషి వంకచూసి నిలిచిపోయాడు.

పెద్దమనిషి తన గంభీరమైన గొంతులోంచి మెల్లిగా చెప్పాడు.

"ఇతనికి క్షమార్పణ యివ్వండి" చూపులతో రైతును నిర్దేశించాడు.

అయ్యరు ముఖం పెట్టుక చూస్తున్నాడు.

అయ్యరే కాదు – క్రమంగాపేరుకుంటూ ఆ టేబిల్ చుట్టూ మూగిన మూకంతా కూడా అర్థంకాని చూపులే చూస్తున్నారు.

పెద్దమనిషి అదే స్థాయిలో అదే పద్ధతిలో మళ్ళా...

"ఇతనికి క్షమార్పణ యివ్వండి"

ఈసారి అయ్యరు సాహసించి మాట్లాడాడు.

"ఏమీ!"

పెద్దమనిషి గొంతు కాస్త పెద్దది చేస్తూ విశదపరిచాడు–

''ఇతనికీ – యీ రైతుకీ – క్షమార్పణ యివ్వమంటున్నాను".

అయ్యరు మళ్ళా వెధవ ముఖం వేశాడు.

ముందుకు తోసుకవస్తున్న గుంపులో ఒకరు పెద్దమనిషిని వెనుక నుంచి సమీపించి చేతిలో స్పృశిస్తూ అడిగారు– "అసలు జరిగినదేమిటండీ?"

పెద్దమనిషి సింహావలోకనం చేసి చాలామంది యువకులనూ, సగపాలు విద్యార్థులనూ చూసి యిటు తిరిగి చెప్పడం ఆరంభించాడు.

"ఈయన – యీ రైతు బిల్లు చూపిస్తూ– బహుశ చదువురాదేమో– యెంతబాబూ" అని అడిగాడు–

"దానికే అయ్యగారి జవాబు వినండి– అధికారి ఉట్టిపడే స్వరంతో 'ఊc తియ్యరా! – మూట విప్పరా! ఆ రూపాయి అక్కడ పెట్టరా! యీ మిగతా చిల్లర పట్టుకుపోరా!' యిదీవరస – ఆ రైతు ఇచ్చిన గౌరవానికి యీయన యిచ్చిన జవాబు చూడండి".

క్షణమాగి చప్పున అయ్యరు వంక తిరిగి–

"ఇటు విను మిష్టర్!"

"నువ్వు అనాగరికుడవే. అయినా నువ్వు మా వల్ల. మేము

నీ దగ్గర కొనుక్కొని నీకిచ్చే డబ్బులో మిగుల్చుకున్న లాభం వల్లే బ్రతుకుతున్నావు.. కాని మేం నీవల్ల బ్రతకడం లేదు. కాబట్టి నువ్వు నీ బ్రతుకునకు ఆధారమైన మమ్మలిని గౌరవించాలి.

"నాగరికత విషయం యెందుకూ – గౌరవించి పలకరించిన వానికి జవాబు గౌరవపూర్వకంగా యిస్తాడు– పశువు కాని యే మనిషి అయినా.

"ఈనాడు 1946 సెప్టెంబరు నెల. ప్రతి జాతి, ప్రతి వృత్తి, దేనికదే గౌరవనీయమైనది. అటువంటప్పుడు పట్టణవాసులు పల్లీయులను కాని, ధనవంతులు బీదవారిని కాని, ఉద్యోగులు రైతు కూలీలని కాని అగౌరవ పరచడానికి వల్లకాదు – యీనాడు. ఇప్పుడు ఒక మనిషిని యింకొకరు అగౌరవిస్తే సహించడం మరిచిపోతున్నారు – సహించరు.

"–ప్రస్తుతం అతనికి క్షమార్పణ చెప్పండి".

అయ్యరుకు యీమధ్య వెనకవచ్చి నిలబడ్డ సెర్వర్లరాక... ఏమాత్రం.. ధైర్యాన్ని కలిగించింది కాబోలు దాబుగా మాట్లాడ ప్రయత్నిస్తూ అన్నాడు.

"మిమ్మలిని నేనేమేనా అంటినా? ఎవరినో యేమో అంటే మీకెందుకు? మీ దారిని మీరు పొండి. ఇక్కడ అనవసర గొడవ చెయ్యడం బాగాలేదు".

అయ్యరు మాట పూర్తి అవకుండా అందుకున్నాడు పెద్దమనిషి. తన గంభీరమైన గొంతును విచ్చలవిడిగా విడిచిపెట్టాడు.

"వాడూ! నేనూ! అనే 'చీలిక' బుద్ధి – సంకుచితత్వం – కొద్దిరోజులు క్రిందటే యింకిపోయింది. 'మనమూ! మేమూ!' అనే పదాలే మిగిలాయి. మనలో యెవరిని యెవరు అవ మానించినా అందరినీ అవమానించినట్టు.. తప్పు చేసినవాడు క్షమార్పణ చెప్పి తీరాలి. ముందతనికి క్షమార్పణ చెప్పండి".

పెద్దమనిషి ఆగిపోయి పట్టుదలగా అయ్యరు ముఖంలోకి చూస్తున్నాడు. అయ్యరు సూటిగా అతని ముఖంలోకి చూస్తూ.

"అయితే దౌర్జన్యం చేస్తారా?"

దీనికి పెద్దమనిషికన్నా ముందు ఓ విద్యార్థి అందుకున్నాడు.

"ఇదుగో అయ్యర్! ఆ శ్రీరంగనీతులన్నీ ఆ డ్రాయరులో దాచు, ముందు క్షమార్పణ"

అయ్యరు వెనుక నిలుచున్న ఓ నల్ల పెదవుల సెర్వర్ యేదో జవాబియ్య బోయాడు విద్యార్థి చురుగ్గా అందుకున్నాడు వేలుతోచూపిస్తూ.

"నీతో మాట్లాడటం లేదు. నీ పనేదో చూసుకో"

మూకలోంచి యింకొకరు అన్నారు.

"తప్పుచేశాక క్షమార్పణ చెప్పవద్దటయ్యా! సిగ్గుపడి యేం లాభం! క్షమార్పణ యిచ్చేసేయ్".

తర్వాత యింకొకరు.

"అయ్యర్! నీ వంక నేరం వుంది. ఇంతమంది శాంతంగా పెద్దమనిషి తరహాగా క్షమార్పణ చెప్పమంటున్నప్పుడు చెప్పి తీరవలసిందే. ఇందులో చిన్నతనం యేమీ లేదు. పొరపాట్లు చెయ్యడం మానవ సహజం. ఇంకోసారి చెయ్యకుండా జ్ఞాపకం పెట్టుకోవడానికి పశ్చాత్తాప రూపంగా క్షమార్పణ చెప్పి తీరాలి"

తర్వాత మూకంతా దోషికి సమయమిస్తూ మౌనంగా వూరుకున్నారు. అయ్యరు ముఖం మాడ్చుకొని యేవేవో అసహ్యపు ఫోజులు యెన్ని పెట్టినా చివరకు క్షమార్పణ యిచ్చేశాడు.

"అయ్యా! క్షమించండీ!"

అనేశాడు నాటకంలో లాగ. వెంటనే మూకలోంచి ఓ ఉత్సాహపూరిత మైన గొంతు చక్కటి ట్యూనులో వచ్చింది–

"శహబాష్"

నవ్వుకుంటూ మూకంతా చెదిరిపోయింది.

రైతు, పెద్దమనిషి ప్రక్కగా నడుస్తూ అన్నాడు.

"ఏంది బాబూ! యీ గొడవంతా! మనని ఒక మాటంటే మనం సిన్నోళ్ళమయి పోతామా?! అతని పాపాన అతనే పోను!"

పెద్దమనిషి మనస్సు చివుక్కుమందేమో–

"ఇదుగో అన్నా! చెపుతున్నాను. ఈరకం అనాసక్తే మీ గౌరవాన్ని మంటగలిపింది... మీలో".

ఇంతలో విద్యార్థుల గుంపు వీరి ప్రక్కగా పోతోంది. పెద్దమనిషి వారిని వుద్దేశిస్తూ అన్నాడు–

"మీరు కాలేజీ విద్యార్థులనుకుంటాను"

ఇందాక మాట్లాడిన విద్యార్థి "అవునండీ" అంటూ ఆగిపోయాడు. అతని వెనుకవస్తున్న ఏడెనమండుగురూ ఆగిపోయారు.

"సహకారం, ఐక్యత, ముందంజ, నేడు ప్రతి విద్యార్థిలోనూ ప్రేరేపింప బడ్డాయి. ఇవాళ ప్రత్యక్షంగా చూశాను" అన్నాడు పెద్దమనిషి చిరునవ్వుతో.

విద్యార్థి చేతులు జోడించి–

"ఇకముందు కూడా – తరుచు– అవసరమైనప్పుడల్లా చూడగలగాలని వాంఛిస్తూ సెలవు తీసుకుంటాం".

విద్యార్థులందరూ తల వంచారు.

పెద్దమనిషి చిరునవ్వుతో తల వంచుతూ చేతులు జోడించి "జైహింద్!" అన్నాడు.

వాళ్ళు విడిపోయి చెరొకవంకా పోతున్నారు.

నేను సంతోషభరితమైన హృదయంతో వెనుతిరిగిపోయే ఆ పెద్దమనిషిని చూపులతో కౌగలించుకుంటూ అనుకున్నాను.

"అటు బలానికి లక్ష్యం అదీ!" ★

*(కథాంజలి: దీపావళి సంచిక, అక్టోబరు 1946)*